# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-04-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిన్నటితో ముగిసింది.**

**2.** **ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్‌ను 83 శాతంకన్నా అధికంగా సాధించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు.**

**3.** **అన్ని సామాజిక వర్గాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ అజెండా అని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అన్నారు.**

**4.** **పని ప్రదేశాలలోని కార్మికుల భద్రత, ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఈ రోజు ప్రపంచ భద్రతా దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

============================

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిన్నటితో ముగిసింది. 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు మొత్తం 686 నామినేషన్లు దాఖలైనట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇందులో 503 నామినేషన్లకు రిటర్నింగ్ అధికారులు ఆమోదం తెలిపారు. మొత్తం 183 నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. అత్యధికంగా గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి 47, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి అత్యల్పంగా 16 దాఖలయ్యాయి.

175 శాసనసభ నియోజకవర్గాలకుగాను మొత్తం 3 వేల 644 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో 2 వేల 705 నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు పరిశీలన అనంతరం ఆమోదించారు. 939 నామినేషన్లు తిరస్కరించారు. అత్యధికంగా తిరుపతి శాసనసభ నియోజకవర్గానికి 52 దాఖలైతే, అత్యల్పంగా అనకాపల్లి జిల్లా చోడవరం నియోజవర్గంలో 8 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

తెలంగాణలో నామినేషన్ల పరిశీలన తర్వాత 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో 625 నామినేషన్లను ఆమోదించినట్లు ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 893 మంది 1488 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా... వాటిలో 268 మందికి చెందిన 428 సెట్లను ఎన్నికల సంఘం తిరస్కరించింది. మల్కాజ్‌గిరిలో 114 మంది నామినేషన్లు వేయగా.. వాటిలో 77 తిరస్కరణకు గురయ్యాయి. మెదక్‌లో ఒక నామినేషన్ చెల్లుబాటు కాకపోగా... 53 ఆమోదించారు.

రేపటి వరకు నామినేషన్ల ఉపసంహరణకు ఎన్నికల సంఘం గడువు విధించింది. ఉపసంహరణ అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల్లోఓటింగ్‌ను 83 శాతంకన్నా అధికంగా సాధించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. గుంటూరులో ఎన్నికల అవగాహనా కార్యక్రమం స్వీప్‌లో భాగంగా ఓటర్లకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన 3K వాక్‌ను ఆయన నిన్న ప్రారంభించి పాత్రికేయులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 18 ముఖ్యపట్టణాలలో ఓటింగ్ శాతం 68 కన్నా తక్కువగా ఉందని, అందువల్ల పట్టణాలలో ఉండే ఓటర్లపై ఎక్కువ దృష్టి పెడుతున్నామని వివరించారు. పరిశ్రమలలో పనిచేసే వారికి పోలింగ్ రోజున పెయిడ్ హాలిడేగా ప్రకటించామని ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు.

**.....వాయిస్.... 32 సెకన్లు......**

---------------------------

అన్ని సామాజిక వర్గాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ అజెండా అని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాదు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో నిన్న ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... దేశంలో బీసీలు 50శాతానికి పైగా ఉన్నారని, జనగణన చేసి వారికి రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య విలువలు, విధానాలకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు.

---------------------------

పని ప్రదేశాలలోని కార్మికుల భద్రత, ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఈ రోజు ప్రపంచ భద్రతా దినోత్సవం నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ...ఐఎల్ఓ పిలుపుమేరకు 2003 నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 28 వ తేదీన ఈ కార్యక్రమం జరుపుకుంటున్నారు. కార్మికులు తాము పనిచేస్తున్న ప్రదేశాలలో వృత్తిపరమైన ప్రమాదాలు, వ్యాధులు నివారించే దిశగా అవగాహన కల్పించడానికి ఈరోజు అంతర్జాతీయంగా, దేశీయంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల ప్రవేశాలకు నిన్న నిర్వహించిన పాలిసెట్-2024కు 88.74శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షకు ఒక లక్షా 59 వేల 989 మంది నమోదు చేసుకోగా... ఒక లక్షా 41 వేల 978 మంది పరీక్ష రాసినట్లు ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రాథమిక 'కీ'ని ఈ నెల 30వ తేదీన విడుదల చేస్తామన్నారు. ఫలితాలను మే 10వ తేదీలోపు విడుదల చేసి, విద్యా సంవత్సరాన్ని జూన్ మొదటి వారంలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

తెలంగాణలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్ష పాలిసెట్‌కు నేటితో గడువు ముగుస్తుందని మసాబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.రాజేశ్వరీదేవి తెలిపారు.

100 రూపాయల ఆలస్యరుసుంతో ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్ష మే 26వ తేదీన నిర్వహిస్తామని వెల్లడించారు.

---------------------------

ఎన్డీయే కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలు, హోంగార్డులు, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తుందని తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన ప్రసంగించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, సీపీఎస్ రద్దు విషయంలో విఫలమైందని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తొలి సంతకం మెగా డీఎస్సీపైనే చేస్తామని ఆయన వెల్లడించారు. ప్రతి మహిళకు నెలకు 15 వందల రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని.. తల్లికి వందనం కింద ప్రతి పిల్లవాడికి ఏటా 15 వేల రూపాయలు ఇస్తామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలన్నా... యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా.. ఎన్డీఏ కూటమిని అధికారంలోకి తీసుకురావాలని రాజమహేంద్రవరం పార్లమెంట్ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిన్న నిర్వహించిన ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత రాజమహేంద్రవరంను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు.

---------------------------

జాతీయ సమైక్యత కోసం దేశానికి, రాష్ట్రానికి సేవ చేసేందుకు స్కౌట్స్ కృషిచేయాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ చీఫ్ కమిషనర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడికొండలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో జరుగుతున్న 'రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపు' ను నిన్న సురేష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను ప్రారంభించాలని, విద్యార్థి దశ నుంచే ప్రజలకు సమాజసేవ చేయాలనే దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందించాలన్నారు. ఈనెల 24వ తేదీ నుంచి జరుగుతున్న ఈ క్యాంప్ రేపటితో ముగుస్తుంది.

---------------------------

తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సర ప్రవేశాల కోసం గురుకుల ప్రవేశ పరీక్ష ఈరోజు నిర్వహిస్తున్నట్లు బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు జరిగే ఈ పరీక్షకు 18 వేల 989 మంది హాజరవుతారని పేర్కొన్నారు.

---------------------------

శంషాబాద్ విమానాశ్రయ మెట్రో మార్గంలో నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 14 కిలోమీటర్ల మార్గంలో 13 స్టేషన్లు రాబోతున్నాయని హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఈ మార్గంలో మెట్రోరైలు ఎలైన్‌మెంట్, స్టేషన్ల స్థానాలను ఖరారు చేసేందుకు నిన్న ఆయన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో

పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రస్తుత నాగోల్ స్టేషన్ సమీపంలో మొదటి స్టేషన్‌తో మొదలై, నాగోల్ చౌరస్తా, అల్కాపురి చౌరస్తా, కామినేని ఆసుపత్రి, ఎల్బీనగర్ కూడలి, సాగర్ రింగ్‌రోడ్డు, మైత్రీనగర్, కర్మన్‌ఘాట్, చంపాపేట రోడ్డు కూడలి, ఒవైసీ ఆసుపత్రి, డీఆర్‌డీవో, హాఫీజ్ బాబానగర్, చాంద్రాయణగుట్ట ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లు రాబోతున్నాయని వెల్లడించారు.

-----------------------------

తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రుతిఓజా నిన్న ప్రకటన విడుదల చేశారు. మే 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి 5 గంటల 30 నిమిషాల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయి.

-----------------------------

ప్రముఖ సంఘ సంస్కర్త కాళ్ళకూరి నారాయణరావు జయంతి ఈరోజు. "మహాకవి" బిరుదాంకితులైన ఆయన 1871 ఏప్రిల్ 28వ తేదీన అప్పటి పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో జన్మించారు. ఆయన రచించిన నాటకాలు, చలన చిత్రాలు కూడా రూపొందించారు. జన హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించిన కాళ్ళకూరి నారాయణరావు 1927 జూన్ 27వ తేదీన తుదిశ్వాస విడిచారు.

=======================